REGD: NO. H 18 విడి ప్రతి 0-20 పై. 12-11-65 శుక్రవారం

# జమీన్ రైతు

సంస్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 37 ] సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి [ సంచిక 45



నవంబరు 14 న జవహర్ 77 వ జన్మదిన పర్వదినం. స్వర్గవాసియైన ఆ మహనీయునికివే మా జోహారులు.

# భారీవిద్యుత్ కర్మాగారం

## ప్రధానిచే ప్రారంభోత్సవం : కార్మిక రాజకీయాలు

గత రెండు నెలల్లో భారత విజయ నాయకుడుగా, భారత ప్రజల నవ్యోత్సాహ దీక్షలకు ప్రతిబింబంగా నవ్యరూపం ధరించిన ప్రధాని శాస్త్రి గారికి అఖండమైన స్వాగతమిచ్చి, కనక తులాభారంచేసి సత్కరించేందుకు ముఖ్యమంత్రి దృఢ సంకల్పులై వున్నారు.

**మా హైదరాబాదు విలేఖరి**

సెప్టెంబరులోనే ప్రధానమంత్రి మన రాష్ట్ర రాజధానికి రావలసింది. కాని పాకిస్తాన్ దురాక్రమణ కారణంగా ఆయన ఢిల్లీనుండి కదలడానికి వీల్లేకపోయింది. ఈసారికూడా ఒకరోజుమాత్రమే ఆంధ్ర ప్రదేశ్‌లో గడపగలుగుతానని ఆయన చెబుతున్నారట. కాని మరొకరోజైనా ఆయన్ను ఇక్కడవుంచాలనీ, కేవలంరాష్ట్ర రాజధాని పౌరులకేకాక ఇతరప్రాంత ప్రజలకుకూడా ఆయన సందర్శనావకాశం కల్పించాలనీ ముఖ్యమంత్రి ఆశిస్తున్నారు.

వారితులాభారంకూడా హైదరాబాదులో జరిపించడమా, లేక తిరుపతిలో కాని రాజమండ్రిలోకాని ఏర్పాటు చేయడమా అనేది ఇంకా తేలలేదు. రాజమండ్రిలో మాత్రం, ప్రధానమంత్రి రాకకోసం యేర్పాట్లు జరుగుతున్నాయి. హైదరాబాదు లాల్‌బహదూర్ స్టేడియంలోను, రాజమండ్రి అయితే పావన గోదావరి తీరంలోను, బహిరంగసభల్లో ఆయన ప్రసంగిస్తారు. నవంబరు 13 న రక్షణమంత్రి చవాన్ కూడా హైదరాబాదు వస్తున్నారు.



14 వేది కావలికి విచ్చేస్తున్న ఉపరాష్ట్రపతి డాక్టరు జకీర్‌హుసేన్.



ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రికి కలకత్తా పౌరుల అపూర్వ స్వాగతం.

# పనికేమో స్థానికులు పెత్తనానికి పరాయివారా?

హైదరాబాదు వచ్చినపుడు ప్రధాన మంత్రి పాల్గొనే కార్యక్రమాల్లో ఇక్కడికి 16 మైళ్ళదూరంలో రామచంద్రాపురం వద్ద వున్న భారత హెవీ ఎలెక్ట్రికల్ ఫ్యాక్టరీకి ప్రారంభోత్సవం ఒకటి.

ఈ హెవీ ఎలక్ట్రికల్స్, కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రదేశంలో నెలకొల్పుతున్న పెద్దపరిశ్రమ. దాదాపు రు. 40 కోట్లు దీని మొత్తంపెట్టుబడి. రాష్ట్రప్రజలు, ప్రభుత్వం ఎంతో ఆందోళనచేయగాదక్కిన ప్రాజెక్టుకనుక మనప్రత్యేకాభిమానానికి పాత్రమైనది. ఈ ఆందోళనే మూడేళ్ళక్రితం మనం చేయకపోయినట్లయితే, ఈపథకం మొత్తం బొంబాయికు తరలింపబడేది. అప్పటికి మనకుమిగిలింది ఒకభాగంమాత్రమే. మరొకభాగమైన బాయిలర్ల ఫ్యాక్టరీని త్రిచూరులో నెలకొల్పుతున్నారు. ఉత్పత్తి

—తరువ 12 వ పేజీలో

# నెల్లూరులో దుర్భరమైన దోమలబాధ

## మునిసిపాలిటీ నిర్లక్ష్యమా? నిస్సహాయతా?

ఎన్నిసార్లు వ్రాయను? ఏమని వ్రాయను? ఎంతని వ్రాయను? వ్రాసి కొద్దీ మునిసిపల్ అధికార్లలో కదలిక రావలసిందిపోయి మొద్దుబారిపోతున్నట్లున్నది. రోజురోజుకు దోమలబాధ దుర్భరమైపోతున్నది. పౌరులలో ఓర్పు, సహనమూ పూర్తిగా పోతున్నది. నిద్రలేదు, ఆరోగ్యంలేదు. పౌరుల రక్తాన్ని దోమలు ఈవిధంగా త్రాగుతుంటే, మునిసిపల్ అధికార్లునిద్ర పోతున్నారనుకోండి, పైన యెవరూ అడిగేదిక్కులేరా అని మాప్రశ్న.

పూర్వం ఎప్పుడూ యింత కాలం, ఇంత ఒపరీతంగా దోమలు వుండినదిలేదు ఎప్పుడో వేసవికాలంలో, టవునులోని పంటకాల్వల్లో చెరువునీరు పారకుండా, మురుగునీరు నిల్చినపుడుమాత్రం ఒక నెల రోజులో ఇంకా తక్కువకాలమో దోమలు వుండేది. అప్పుడు మునిసిపల్ ఆరోగ్య శాఖవారు వెంటనే చర్యలు తీసుకునేవారు. పబ్లిక్ వర్క్సు డిపార్టుమెంటువారినడిగి కాల్వలకు నీరు వదలిపెట్టించేవారు. డి.డి.టి. వగైరాలు యెక్కువగా స్ప్రే చేయించేవారు. ఎట్లయినా దోమలబాధను నివారించేవారు.

**పత్రికలు దోమలను చంపగలవా?**

'న్యూయార్కు టైమ్సు'పత్రికకు వుపయోగించే న్యూస్‌ప్రింట్ నుండి లభించే వొకకొత్తరకం హార్మోన్‌తో దోమలను చంపవచ్చని అమెరికన్ శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. టైమ్సు ఆదివారం సంచిక దాదాపు 200 పేజీలకుమించి మానవమాత్రు డెవడూ చదవలేనంత భారంగా వుంటుంది! మరి నెల్లూరులోవెయేపత్రిక లిందుకుపనికివస్తాయో! నెల్లూరులో వున్న కాలేజీలు యీవిషయమై పరిశోధనచేసి పుణ్యం గట్టుకొంటే బాగుంటుంది.

ఇప్పుడెందువల్లనో ఏచర్యాలేదు. టవున్‌లోని మూడుకాలవల్లో రెంటిలో మామూలుగా నీరుపారుతున్నది. రేవల్ పాటికాల్వకు గోడలుకట్టి, మూసివేసి; మల్లప్ప కాల్వనుమాత్రం మురికితూమంగా వదలివేశారు. ఆ కాల్వలోచేరే మురుగునీరంతా అట్లనే నిల్వ వుంటున్నది. అందులోవేసే చెత్తాచెదారం టీకి, కుళ్ళి దుర్గంధభూయిష్టమై, దోమలకు స్వర్గధామంగా, పౌరులకు నరకకూపంగా తయారయింది. ఒక్కసారైనా ఆ కాల్వలోకి చెరువునీరు వదలి, శుభ్రంచేస్తే ఆ బాధ నివారణవుతుంది. లేక ఖర్చు యెక్కువనుకోకుండా మందులుచల్లిస్తే కొంత ఫలితముంటుంది. చెత్తాచెదారం పూడికతీయిస్తే బాగుంటుంది. ఎంత మందులుచల్లినా నీరువదలి, శుభ్రం చేసినట్లుగావుండదు. మునిసిపాలిటీవారు ఆ పని యెందుకుచేయరు? నిర్లక్ష్యమా? నిస్సహాయతా?

స్పెషల్ ఆఫీసరు నరసింహస్వామి

—తరువ 7-వ పేజీలో

వింటే భారతం వినాలె

తింటే గారెలు తినాలి

మరి, త్రాగితే ?

నిర్మల కాఫీ త్రాగాలె!

ఇది మా మాటకాదు; అసంఖ్యాకులైన మా వినియోగదార్ల అభిప్రాయం.

అపురూపమైన మా టెబిల్ లేబిల్ వక్కపొడిని కూడా మరచిపోకండి!

నిర్మల కాఫీ వర్క్సు,

ట్రంకురోడ్డు (ఫోన్ : 280) నెల్లూరు

